**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-4, Oct-Dec-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# నందిని సిధారెడ్డి "చిత్రకన్ను" కథలు - వస్తువైవిధ్యం

**డా. సయ్యద్ ఆఫ్రిన్ బేగం**

తెలుగు అధ్యాపకురాలు, దక్షిణ ప్రాంగణం, తెలంగాణ విశ్వవిద్యాలయం, భిక్నూర్.

**Corresponding Author: డా. సయ్యద్ ఆఫ్రిన్ బేగం.**

**Abstract**
తెలుగు కథా సాహిత్యంలో వాస్తవికతను ప్రతిబింబించిన కథా సంపుటాల్లో ꞉చిత్రకన్ను꞉కు విశిష్ట స్థానం ఉంది. ఈ కథా సంపుటిలోని కథల్లో యథార్థత స్పష్టంగా కనిపిస్తుంది, నిజత్వం ఆధారంగా నిర్మితమైంది. రచయిత సమాజంలోని విభిన్న కోణాలను అనగా బాల్యంలో ఎదుర్కొన్న వర్ణ వివక్షత, పెత్తందారి వ్యవస్థ, బానిసత్వం, శ్రమదోపిడి, ఆడ పిల్లల పట్ల అమానవీయ కృత్యాలు, అంతరిస్తున్న కుల వృత్తుల పట్ల ఆవేదన, దొరల నిరంకుశత్వం, బాల కార్మికుల బతుకు ఆవేదన, తిరుగుబాటు ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించడం, సామాన్య స్త్రీల జీవన గాథలు మరియు వ్యథలు వంటి వివిధ వస్తు దృక్కోణాలతో ఆవిష్కరించారు. ꞉చిత్రకన్ను꞉ కథా సంపుటిలోని వస్తువైవిధ్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**Keywords:** వస్తు వైవిధ్యం - వాస్తవిక గాథలు, బానిసత్వపు జీవన విధానం, మనిషి ఆవేదనలు అవమానాలు, పిల్లల మానసిక సంఘర్షణలు, కర్కశత్వం, రాజకీయ పరిణామాలు, స్త్రీల మనస్తత్వపు కోణాలు, సామాజిక మార్పు మరియు చైతన్యం.

**ఉపోద్ఘాతం:**

కథలో ఒక మనిషి జీవితమంతా చెప్పనక్కర్లేదు కానీ జీవితం సమస్తం ధ్వనిస్తూ ఉండాలి. ఈ నేర్పు సాధించుకున్న రచయితకి కథారచన మీద పట్టు చిక్కుతుంది. రచన పట్ల హృదయ సాన్నిహిత్యం పెంపొందించుకున్న రచయితల కథల్లో ఆ నేర్పుని ఆనందించగలుగుతాం. అలాంటి కథాశిల్పి డాక్టర్ నందిని సిధారెడ్డి గారు. వీరు రచించిన కథా సంపుటి "చిత్రకన్ను". ఈ సంపుటిని పరికిస్తే రచయిత తన జీవన గమనంలో పొందిన అనుభవాలకు తగినట్లుగా తన రచనలో విభిన్న ధోరణులకు సంబంధించిన పాత్రలను సృష్టించారు. ఇవి సామాన్య జీవితానికి ప్రతినిధులుగా కనిపించడం, వాస్తవిక దృక్కోణం కలిగిన కథలుగా నమ్మకాన్ని కలిగిస్తాయి. ఈ నేపథ్యంలో వచ్చిన కథల్లో ఉన్నటువంటి విభిన్నతను ఈ వ్యాసంలో తెలియజేయడం జరుగుతుంది.

**꞉చిత్రకన్ను꞉ - వస్తువైవిధ్యం:**

స్వచ్ఛమైన హృదయం ఎలా ఉండాలో చూపించే "హృదయం" కథలో కీలకపాత్ర బుచ్చిగాడిది. తన హృదయానికి నందిని సిధారెడ్డి గారు ప్రాణం పోశారు. ఇందులో బుచ్చిగాడి బాల్యంలో తనని కొందరు ఎగతాళి చేయడం, కొందరు ఏడిపించడం, ఇంకా తన ఇంట్లో తనకు అందాల్సిన ప్రేమ స్వార్థంతో నిండి ఉండడం ఇవన్నీ నిస్వార్థమైన ఇంకో హృదయాన్ని వెతకడానికి దారి తీశాయి. బుచ్చిగాడు బడికి వెళ్ళకపోతే వాళ్ళ నాన్న కొడుతూ బడి గేటు వరకు తీసుకెళ్ళడం చూస్తే మన నిత్య జీవితంలో కూడా ఇవి ఎందరికో జ్ఞాపకాలే అని చెప్పుకోవచ్చు. స్వార్థం లేని అనుబంధాన్ని "నీలు" లో వెతుక్కోవడం, "నీలు" అనే పిల్లి జీవితం, బుచ్చిగాడి జీవితం సమాంతర జీవితాలుగా

బుచ్చిగాడికి అనిపించాయి. తన వాళ్ళు చనిపోతే కూడా కన్నీళ్ళు రాని బుచ్చిగాడికి, దొమ్మరోళ్ళు "నీలు" ను చంపి తినేస్తే, అవశేషాలుగా మిగిలిన భాగాలను స్మశానానికి తీసుకెళ్లి కట్టెలపై పెట్టి వెక్కి వెక్కి ఏడుస్తూ కాష్టం చేయడం గమనిస్తే, స్వార్థమనే చీకటి కమ్మిన హృదయాలకు ఃనీలుః చితితో వెలుగు దారి చూపే "బుచ్చి" పాత్ర అందరి హృదయాలతో నిస్వార్థ బంధాన్ని పెనవేసుకొని నిలిచిపోతుంది.

పల్లెలు ఏర్పాటు చేసుకున్న ప్రకృతి అలారాలు పల్లెటూరు నాటుకోళ్ళు అని వాటి కూతులతో జానపదులను నిద్రలేపి, తమ తమ పనులకు పురమాయించడం వంటి హడావిడి చూస్తే మన పల్లెలు మన మదికి యాదిరాక మానదు. తరాల నుండి నమ్మిన "కులకశిపె" తన కుటుంబానికి కూడు పెడుతుందని నమ్మే ఓ తండ్రి ఆలోచనా ధోరణిలో సాగే నారాయణ పాత్ర, కులకుశ్విని భుజాలపై ఎత్తుకొని పల్లె ఒడిని విడిచి పట్నం, ప్లాట్ ఫామ్ గూటికి చేరి చేసే జీవన పోరాటం, మిత్రుడైన రాజిరెడ్డి ఆరాటం ఃకులకశ్విః కథలో నందిని సిధారెడ్డి గారు కళ్ళకు కట్టినట్టుగా చిత్రించారు. యంత్రాలు (ట్రాక్టర్లు) రావడం ద్వారా చేతి పనులు తగ్గడం, పనులకోసం వేరే వేరే ప్రాంతాలకు తరలిపోవడం. ఆధునిక జీవితాలకు ఈ కథ అద్దం లాంటిది. సాదా సీదాగా సాగలేని నారాయణ జీవితానికి చిన్ననాటి రాజిరెడ్డి స్నేహం చేయందిచ్చి ప్రోత్సహించడం నిజమైన స్నేహానికి నిదర్శనంగా సిధారెడ్డి గారు చిత్రించిన తీరు ఆదర్శనీయంగా, ఆచరణయోగ్యంగా చిరస్మరణీయం. ఃకులకశ్వి - కళకశ్విః అయినా ప్రతిభ ఉంటే మారుతున్న కాలానికి అనుగుణంగా కళకు పదును పెడుతూ ఆగిపోకుండా సాగిపోవాలి ఇదే జీవితమని, నారాయణ పాత్ర అందరికి సందేశమిస్తున్నట్లుగా సిధారెడ్డి గారు సహజ సుందరంగా నిర్మించిన తీరు అద్భుతం.

ముగ్గురు కొడుకులు అయినప్పటికీ బాలవ్వ మరణం చాలా దయనీయంగా ఉండడం, చివరి కోరికగా ఆ తల్లి చచ్చిపోయినంక నన్ను పాతిపెట్టకుండ్రి కాలియ్యండ్రిరా, ఆఖరుకు నాతో ఉన్న బంగారం పెట్టైనా సరే అని కోరడం, ఆ కోరిక తీర్చడంలో కూడా కొడుకు వ్యాపారం దగ్గర బేరమాడినట్లుగా కన్నతల్లి చావు దగ్గర బేరమాడడం పాఠకుల హృదయాల్లో నర్సయ్య పిసినారితనం ముల్లై గుచ్చక మానదు. మరణానికి ఏడుపే ఘంటానాదం అన్నట్లు లచ్చవ్వ ఏడుపు పదుగురు జనాన్ని గునగునా పరుగెత్తుకొచ్చేలా చేయడం, చావు తర్వాతి కార్యక్రమాలకు మాదుగలు రావడం, వాళ్ళతో ఇరవై అని, యాభై అని బేరమాడడం మాదిగలు ఎనభై కన్నా తక్కువైతే చేయమని మాట్లాడే తీరు ఇవన్నీ పల్లె జీవనంలో ఓ భాగంగా మన కళ్ళకు కనిపించేలా సిధారెడ్డి గారు ఈ కథను తీర్చిదిద్దారు. మాదిగలకు, నర్సయ్యకు మాటా మాటా పెరిగి బూతులు తిట్టుకుంటూ గొడవ పడడం, నలుగురు పెద్దలుండి కూడా సమస్య పరిష్కరించపోవడం, చివరికి లచ్చవ్వ మనమే చేసుకుందాం పోదాం పదా! అని చెబుతుంది. నర్సయ్యకు ఆ ఆలోచన నచ్చడం, నిజంగా అక్కడి వాళ్ళంతా చెవులు మూసుకొని వాళ్ళ నిర్ణయానికి తిట్టుకుంటూ వెళ్ళడం కథలో లోభత్వం పాఠకుల్ని కూడా విస్తుపోయేలా చేస్తుంది. నర్సయ్య కుటుంబం, పనివాడు ముత్తడు కలిసి అర్ధరాత్రి కాష్టం పేడ్చి రావడం, ఉదయం పాడె కట్టడం, వీటిని గమనిస్తున్న మాదిగల మనసుల్లో భయం కలుగుతుంది. ఊర్లో ఎవరు చచ్చినా ఎవరికివారే కాష్టం పేర్చుకుంటే మనకు పని దొరకదని మాదిగలు అనుకోగా, పేడ్చిన కాష్టాన్ని ముందే అంటిస్తారు. ఈ పని చేసిన మాదిగల గుడిసెల అంటించేలా చేసిన నర్సయ్య కర్కశత్వం, ఆ ఊరిలో సమస్య పరిష్కరించలేని పెద్దల పనితనం మనల్ని ఆశ్చర్యపోయేలా చేస్తాయి. మొగుడు చస్తే డబ్బు ఖర్చవుతుందని బాలవ్వ తన భర్త శవాన్ని ఇంటి వాళ్ళే బొంద పెట్టడం చూస్తే, చేసిన ఖర్మం ఊరికే పోదు అన్నట్లు అదే ఆమె చావుని అంతకన్నా దయనీయంగా చేసిందనిపిస్తుంది. ఃచిత్రకన్నుః కథలో సిధారెడ్డి గారు మనిషి మానసిక స్థితులను రకరకాలుగా చిత్రించిన కథను నిలబెట్టకమానవు అనేలా చేస్తాయి.

‘ఎర’ కథలో పరంధామయ్య అతని భార్య నరసమ్మ, వాళ్ళ ముగ్గురి పిల్లలను చూస్తే ఆ కుటుంబంలో పద్ధతులు చూస్తే నేటికాలంలో మాసిపోయిన కుటుంబ విలువలు గుర్తుకురాక మానవు. ఎంకటిగాని చేత సర్పంచ్, పటేలు, పరంధామయ్య ఇంటిని తగలబెట్టించడాన్ని గమనిస్తే పెత్తందారీతనం, బలహీనవర్గంపై ఆనాడు జరిగే ద్రోహాన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు రచయిత. ఇళ్ళు అంటుకున్న ఘటనకు ఊర్లోని వాళ్ళంతా ఏదో ఒకటి పుకార్లు పుట్టించడం, ఏదేదో మాట్లాడడం చూస్తే ‘లోకులు పలుకాకులు’ అన్నమాట గుర్తొస్తుంది. సర్పంచ్, పటేలు కలిసే చేరీ ఇరవై ఐదు రూపాయలిస్తామని పాలేరు అయిన ఎంకటి చేత ఇళ్ళు అంటించడం, ఇచ్చిన మాట ప్రకారం 25 ఇవ్వకుండా 10 రూపాయలు ఇవ్వడం వాళ్ళ మధ్య వాగ్వాదం జరుగుతుంది. సర్పంచ్ ఇంటికి పరంధామయ్య తనకు కలిగిన నష్టం గురించి చెప్పుకోవడానికి రాగా సర్పంచ్, పటేలు జరిగిన వాగ్వాదాన్ని వినడం జరుగుతుంది. దానిని బట్టి నష్టకారులు వీరే అని గమనించి పరంధామయ్య మరియు అతని కొడుకులు సర్పంచ్, పటేలుపై తిరుగబడతారు.

“సిల్లిగర్ల్’ కథలో ప్రధాన పాత్ర సీత. ఈమె ఆవుల సాంబయ్య కూతురు. తన కూతురికి వచ్చిన సంబంధం, ఊర్లోని వాళ్ళు ఆడపిల్ల వివాహ తంతు గురించి మాట్లాడే మాటలు, ఆ అమ్మాయి కాబోయే భర్త గురించి కలలు కనడం ఇవన్నీ ప్రతీ ఆడపిల్ల జీవితంలో జరిగే అంశాలే అయినప్పటికీ సీతకు జరిగిన అన్యాయం పాఠకుడి హృదయాన్ని కలిచివేస్తుంది. సీత మదిలో కాబోయే వాడి కోసం ఎదురు చూపులు, మన ఇంటి ఆడపిల్లలో కనిపించేలా చిత్రించారు. ఆ ఊరికి కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారికి కలిగిన అధికారం, అహంకారంగా మారడం కొట్టొచ్చినట్లుగా సిధారెడ్డిగారు నిర్మించారు. అహంకారంతో పాటు ఆడవాళ్ళ శరీరాలపై కూడా అధికార కామదాహం రెవెన్యూ అధికారి పాత్రలో కనిపిస్తుంది. పెళ్లి పీటలు ఎక్కి, తాళి మెడలో వేసుకోవాల్సిన సీత, తను కట్టుకొన్న ఎర్రచీరనే ఉరితాడుగా మెడలో ఏసుకుంది. ప్రాణం కన్నా మానమే గొప్పదని నిరూపించే పాత్ర సీతది.

మనిషి ఒంటరితనపు ఆలోచనా ధోరణికి, పదుగురిలో ఉన్నప్పుడు మనిషి తత్వానికి చాలా తేడా ఉంటుందని తెలిపే పాత్రలో కిరణ్ కి జీవం పోశాడు రచయిత. మనిషిలో ఉండే విభిన్న తత్త్వాలను వస్తువుగా తీసుకొని కిరణ్ లాంటి మనుషులు మంచి తనం ముసుగు వేసుకొని బతుకుతుంటారని ‘అసలు మనిషి’ కథలో సిధారెడ్డి గారు చిత్రించిన తీరు వాస్తవ జీవితాలకు చాలా దగ్గరగా ఉండేలా నిర్మించిన విధానం మెచ్చుకోదగినది. అలాంటి వ్యక్తులను మనం కూడా గమనించి గుర్తించాలని మధు, విద్య పాత్రల ద్వారా సమాజానికి సందేశమిస్తున్నట్లు కథను ముగించిన తీరు ప్రశంసించదగినది.

ఆర్ట్స్ కాలేజీ కవతల ఖాళీస్థలమంతా వివిధ రకాల ప్లే గ్రౌండ్గా మారిందని, అదే అడ్డా సాయంత్రం కొంత చీకటి పడగానే గుంపులు (బ్యాచ్లు గుంపులుగా వచ్చే మందుబాబుల ఇక్కట్లు, వాళ్ళ కోసం వెయిటర్స్ మారి మందు సీసాలు మోసే మస్తాన్, బాలి, జానీలు పరుగెడుతున్న జీవితాలను నడిపే కీసాలను నింపుకోవడానికి సీసాలు మోస్తున్నట్లు బ్రతుకెల్లదీయడం, లైంగిక హింసకు గురై వీరు అనుభవించిన దుర్భర జీవన వేదనను, బాల కార్మికులు పడే సమస్యలతో అనుసంధానించడం ‘ఆట’ కథ ద్వారా కళ్ళకు కట్టినట్లుగా ఆవిష్కరించారు.

కన్నడ బిడ్డల భవిష్యత్తు కోసం భర్త లేని ఏ తల్లి అయిన తన కష్టార్జితాన్ని ఆయుధంగా చేసుకొని, పిల్లలకు ఏలోటు కలగకుండా జీవితాన్ని సాగిస్తుంది. అదే విధంగా కిరణ్మయి తల్లి కూడా ఏ కష్టం తెలియకుండా పదహారేళ్ళ వరకు పెంచుతుంది. కిరణ్మయి ఆరేళ్ళకే తండ్రిని కోల్పోవడం, పదహారేళ్ళ వయస్సున్నప్పుడు రోగంతో తన తల్లిని కూడా కోల్పోతుంది. అందానికే చిరునామాలా కనిపించే కిరణ్మయిని చూసి ప్రశాంత్ మనస్సును పారేసుకోవడం, రెండు, మూడు రోజులోనే తనతో మాట్లాడి పెళ్లికి ఒప్పించడం, మరుసటి రోజే (పెళ్లి రోజే) వచ్చి మీయమ్మ వేశ్యా, నువ్వు కూడా

వేశ్యా అని అడిగి, రెండు నోట్లు ఆమెపై ప్రేమకి కిరాయి కట్టడం, ఇలాంటివి డబ్బున్నోళ్ళకి పరిపాటేనని ःఈదేశంలో ఇది మామూలేః కథలో చిత్రించిన తీరు అభినందనీయం.

లత అనే అమ్మాయి అందానికి ముగ్దుడై, ఆమెను ప్రేమించి, మదిలో ఆరాదిస్తూ, రవి ప్రేమలో సఫలీకృతుడై పెళ్లి చేసుకోవాలనుకోవడం, లతకి ఇదివరకే పెళ్లై విడాకులవడం ఈ విషయం తెలిసి రవి లతని వ్యవస్థలోని అవ్యవస్థమైన కల్చర్ విధానాలకు తలొగ్గి ప్రేమని విఫలం చేసుకోవడం ःఎలర్జీః కథలోని వస్తువు. మళ్ళీ తను అనుకున్న కొత్త జీవితాన్ని కోరుకోవడం, తన నిజమైన ప్రేమ ద్వారా లత పాత్ర సమాజానికి, మనుషులకి సోకిన ఎలర్జీని ప్రశ్నిస్తున్నట్లుగా, మనుషుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే సమాజంలో సార్థకమైన పరివర్తన సాధ్యమవుతుందనే సందేశాన్ని ఈ కథ ద్వారా రచయిత వెల్లడించారు.

దిక్కు మొక్కులేని బలహీనుడైన కిట్టన్ని బలహీన వర్గంపై జరిగే పటేల్ ఆదిపత్య పోరుని, అన్యాయాన్ని, కరణం దుర్మార్గపు పనులని వస్తువుగా తీసుకొని కథను నిర్మించిన తీరు ప్రశంసణీయం. బలహీన వర్గపు పేదవాళ్ళ పైన పల్లెల్లో పటేల్ తనం చూస్తుంటే అక్కడ జరుగుతున్న అన్యాయానికి కథను చదివే పాఠకుల హృదయంలో అన్యాయాల్ని ఎదిరించే అగ్గిరవ్వ పుట్టక మానదు. ःపాముల మధ్య చీమః అనే కథ పేరు తగినట్లు సిధారెడ్డిగారు చిత్రించడం అమోఘం అనే చెప్పాలి.

తల్లిదండ్రి లేని పిల్లయినా, ఆదరించి తన కొడుక్కిచ్చి పెళ్లి చేసి, వాళ్ళు కళ్లముందు కలకాలం కలిసుంటే చూసి ఆనందించాలనుకున్న మాస్టారు సీతారామయ్యగారి ఆశలు కొడుకు దూరంగా ట్రాన్స్ఫర్ అయి వెళ్ళి అక్కడ చనిపోవడంతో నిర్జీవమైపోయాయి. ఆ విషయాన్ని కోడలికి తెలియకుండా దాచి, కొడుకు వేణుని పార్వతి హృదయంలో శాశ్వతంగా బతికించే కథగా ःగుండెః కథ అద్భుతంగా చిత్రించారు. కొత్తగా పెళ్ళైన ఆడపిల్ల, ఆ తర్వాత ఎన్నో మధురానుభూతులు కొంతకాలం మధురంగా సాగిన పయనంలో ఓ బిడ్డ జన్మించడం అతను ఉద్యోగరీత్యా దూరంగా ట్రాన్స్ఫర్ అవ్వడం, అదే దూరం శాశ్వతంగా దూరమవ్వడం కథలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. పెళ్ళైన జంట, ఓ అందమైన జీవితం ఎలా ఊహించుకుంటామో సిధారెడ్డిగారు సహజంగా పాత్రలను వర్ణించిన తీరు ఎప్పటికీ పాఠకుల హృదయాలను గెలుచుకుంటుంది.

ఆ ఊరి పెద్ద పటేలు వెంకట్రెడ్డి. చిల్కి తల్లి రామితో ఉన్న అక్రమ సంబంధం గురించి ఊరంతా మాట్లాడడం, వెంకట్రెడ్డి పటేలు కొడుకు చిన్న పటేలు గోపాల్రెడ్డి. రామి కూతురు చిల్కి వరుసకు చెల్లి అవుతుంది. ఆ చిల్కితో గోపాల్రెడ్డి అక్రమ సంబంధం పెట్టుకోవడం దాని మూలంగా ఆమె కడుపులో పడిన నలుసుకు, మల్లడితో కాపురం కూలడం వంటి అంశాలు ఈ కథలో ప్రధానంగా కనిపిస్తాయి. శ్రమదోపిడినే కాకుండా శరీర దోపిడి చేసే దొరతనం, డబ్బును ఆశచూపి పాలె పిల్లల మానానికి ఖరీదు గట్టె పటేలు లాంటి మనిషి కామాందుడిని గోపాల్ రెడ్డి పాత్రలో అవిసిపోయే పేదింటి ఆడపిల్లల జీవితాలను చిత్రించిన విధానం ఈ "ఊబి" కథలో ఆకట్టుకుంటుంది. ఆక్రమ సంబంధం ద్వారా చిల్కికి పుట్టిన బిడ్డకు తనే తండ్రని తెలిస్తే లోకం అసహ్యించుకుంటుందని చివరకు పసిబిడ్డను కూడా చంపడానికి గోపాల్ రెడ్డి ప్రయత్నం చేయగా చిల్కికి తిరగబడి కొడవలితో గాయపరుస్తుంది.

ःనాదానిః కథలో రచయిత ఒక సంక్లిష్ట ఇతివృత్తాన్ని ఆవిష్కరించి, దానిని సమగ్ర కథా నిర్మాణంగా మలిచారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలను విహంగ వీక్షణ దృష్టితో సమన్వయ పరచగలిగిన రచయిత పరిణతి ఈ కథకు ప్రధాన బలం.

పల్లెల్లో దొరల దౌర్జన్యం, పేదలపై ఆధిపత్య పోరు ఉండడం, భార్యను కోల్పోయాక నర్సింలు, తన కొడుకు సెంద్రిగాడు కూతురు లచ్మితో కలిసి ఉన్న ఎకరంన్నర పొలం చేసుకొని నీళ్ళు గుడేసుకొని బతకడం, ఉన్న కాసింత పొలంలో దొర ఎద్దు పడడం, దాన్ని నర్సింలు అదమాయించక పోగా గమ్ముగుండడం దాన్ని చూసి సెంద్రిగాడు ఎద్దును అల్లించడం, దానికి దొర సెంద్రిగాడిని చితకబాదడం, లచ్మి అందరిని పిలవగా చుట్టు పక్కల పొలాల వాళ్ళు కర్రలతో రావడం, దొర ఇద్దరు రౌడీలకు సైగచేసి పారిపోవడం, ఆ రౌడీలు కత్తులతో దాడి చేయడం చివరకు కొడుకు దవాఖానలో వైద్యం చేయించుకోవడం, తన అక్క తలనిమిరడం సెంద్రిగాడు లేచి అయ్యేడి అని అడగడం, లచ్మి నాయిన చనిపోయిండని చెప్పడం. దానికి సెంద్రిగాడిలో తిరుగుబాటు రావడం ఊరంతా చైతన్యపరిచే కథలు చెబుతూ జనాన్ని మేల్కొల్పడం ःబతికినచావుః కథలో ఆనాటి ప్రజల జీవనం కళ్ళకు కట్టినట్లు కానవస్తుంది.

మర్వాడీ అయిన రామ్ లాల్ పెళ్లి బరాతు తంతు అంగరంగ వైభవంగా లాల్ బహదూర్ స్టేడియం దగ్గర నుండి అబిడ్స్ మీదుగా చివరికి కోఠి వరకు కుర్రాళ్ళ డాన్సులతో హుషారుగా సాగుతూ బరాత్లో రాజమ్మ గ్యాస్ లైటు కుడి చేత్తో పట్టుకున్నది, ఎడమ చేత్తో చంకలో తన పసి పాపను పట్టుకున్నది. బరాత్ చివరికి గమ్యం చేరే చివరి ఆఖరు క్షణాల్లో ప్రారంభం నుంచి గమనిస్తున్న శ్రీకాంత్ రాజమ్మనే గమనిస్తున్నాడు. చివరికి తన శరీరం అలిసిపోయి చేతుల్లో సత్తువ కలిగిపోయి బరాత్ ఆగకుండా ఉండేందుకు ప్రయత్నించి చివరకు తన పసికందును వదిలేయడం ఆ బరాత్లో అందరూ డాన్సులతో లీనమైపోయి పడిపోయిన పాపను కాళ్ళతో తొక్కుకుంటూ పోవడం, శ్రీకాంత్ చేతులు చాచినా లాభం లేకపోవడం ఈ "ఖైదీ" కథలో సిధారెడ్డి గారు కథను ఆద్యంతం హుషారుతో బరాత్ను సాగించి, చివరకు ఏమైందో అన్నట్లు చదివించి విషాద హృదయంతో మనసు కదిలేలా కథను చిత్రించాడు.

షావుకారు అయిన వీరేశం ఓ కుక్కని కొనుక్కొని తెచ్చుకోవడం దాన్ని ఇంట్లో జీతగాళ్ళు అందరూ షావుకారు కుక్కని గౌరవంగా ఆరేళ్ళు పెంచడం, ఊళ్ళోని వారంతా భయం, గౌరవం కుక్కపై చూపిస్తుంటే షావుకారు ఆనందంతో పొంగిపోవడం, ఆ ఇంట్లో బానిసగా పనిచేస్తున్న నారాయణను చూస్తూ మెడలో గొలుసుతో జీవనం సాగడం, ఓసారి ఊళ్లోని వీధి కుక్కలన్నీ స్వేచ్ఛగా జీవించడం చూసి ఆ కుక్క బానిస సంకెళ్ళ లాంటి ఆ గొలుసు తెగే దాకా ఓ రోజు నారాయణని, షావుకారు వీరేశాన్ని, పనివాళ్ళని చూసి రాత్రంతా అరవడం, ఉదయాన్నే బానిసతనం వదిలి స్వేచ్ఛా ప్రపంచంలోకి వెళ్ళడం ఈ కథలో ప్రధాన వస్తువు. మనుషుల కన్నా కుక్కలో విశ్వాసం, నిజాయితీ ఇంకా ఒకరి దగ్గర బానిసగా బతకడం నుంచి విముక్తి పొందడం అనే విషయాలు మేళవించి సిధారెడ్డి గారు రచించిన కథే ःషావుకారు కుక్కః.

ఊరి వాగు ఎండిపోతే వరదలో కొట్టుకొచ్చిన ఇసుక మేట దానిలో పలుగురాళ్ళూ, ఆ వాగునానుకొనే అడవి ఉండడం, ఆ అడవి ప్రభుత్వం చేతుల్లో బంధీగావడం, అడవిలో గొర్లు, మేకలు మేపాలంటే ఫారెస్టుల్లకు ःపుల్లరః కట్టించుకోవడం గొల్ల కుర్మలను నిట్టనిలువునా దోపిడీ, దౌర్జన్యం చేసి డబ్బును గుంజడం, చివరకు వాళ్ళంతా ఆక్రమంగా తీసుకుపోతున్న వాళ్ళ గొర్లు, మేకలను ఇడిపించుకోవడానికి కలిసికట్టుగా యాభై మంది దాకా గొల్ల కుర్మలు పోగై తిరగబడడం ఈ ःపుల్లరః కథలోని ప్రధాన వస్తువు. గొర్లను కాసే పాత్రలో పన్నెండెళ్ల బీరవ్వ రూపాన్ని, అడవి అందాల్ని, తన తండ్రి పటేలిండ్ల దగ్గర పొలంజేయటం, ఫారెస్ట్ ఆఫీసర్ల మోసపూరిత చర్యలను నందిని సిధారెడ్డి గారు అందమైన ప్రకృతి పలకరింపులతో ःపుల్లరః కథను వర్ణిస్తూ నిర్మించిన తీరు చూడ చక్కని అడవి తల్లి రూపు రేఖల్లా హృదయంలో కదలాడిపోతుంది.

**ముగింపు:**

ఈ కథా సంపుటి లోని కథలు వస్తు వైవిధ్యాన్ని అభివ్యక్తం చేస్తాయి. రచనాభినివేషాన్ని ప్రదర్శిస్తాయి. ఇందులోని కథలు విస్తృతమైన పరిధిని కలిగి, వ్యక్తి జీవితం నుండి సమాజవ్యవస్థ వరకు ఉన్నటువంటి వాస్తవిక గాథలను కథా వస్తువులు గా స్వీకరించడం వల్ల తెలుగు కథా సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కథా సంపుటిగా "చిత్రకన్ను" ను పరిగణించవచ్చు, రచయిత యొక్క ప్రజ్ఞాశాలిత్వాన్ని కూడా ఈ కథలు చాటిచెబుతాయి.

**ఆధార గ్రంథాలు:**


1. దక్షిణామూర్తి, పోరంకి, కథానిక స్వరూప స్వభావాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1988.
2. మల్లయ్య, కాలువ, తెలుగు కథ విభిన్న ధోరణులు, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2012.
3. రాజిరెడ్డి, పప్పుల, సిద్దిపేట జిల్లా సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 2019.
4. శరత్ జ్యోత్స్నా రాణి, ఎస్., స్వాతంత్ర్యానంతరం తెలుగు కవిత- వస్తువు, రూపం, శిల్పం, 2003.
5. సిధారెడ్డి, నందిని, "చిత్రకన్ను" కథలు, మంజీరా రచయితల సంఘం, మెదక్, 2016


**Citation:** డా. సయ్యద్ ఆఫ్రిన్ బేగం. 2026. "నందిని సిధారెడ్డి "చిత్రకన్ను" కథలు - వస్తువైవిధ్యం". International Journal of Academic Research, 13(4): 13-18.

**Copyright:** ©2026 డా. సయ్యద్ ఆఫ్రిన్ బేగం. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.